మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- మౌలిక వసతులపై ఆరా
- ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీ, పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ
- కలెక్టరేట్‌లో పశు సంవర్ధకశాఖ అధికారులతో సమీక్ష

కలెక్టరేట్: పశుసంవర్ధకశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు వివరాలు తీసుకున్నారు. ఫార్మసీ, ప్రసూతి గది, ల్యాబ్, పీహెచ్‌సీ షెడ్డును పరిశీలించారు. పీహెచ్‌సీలో పీవోపీ పనులు, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారును ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోసం నూతన భవనాలు లేని విషయాన్ని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాబు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఇక్కడ తహసీల్దార్ రామచంద్రం, వైద్యాధికారి స్రవంతి, డాక్టర్లు ప్రదీప్, రఘు ఉన్నారు.

పెంపకందారులకు అవగాహన కల్పించాలి

కలెక్టరేట్, జూన్ 25: వానకాలం నేపథ్యంలో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై పెంపకందారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. పశు సంవర్ధకశాఖపై సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ శాఖ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పాడి పరిశ్రమ, పాడి ఉత్పత్తులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వానకాలం నేపథ్యంలో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని, రోగాల నివారణకు వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య ఏడీ డా రమణమూర్తి, డా అంజిరెడ్డి, ఇతర వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి కార్యాచరణ

- కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభిస్తాం
- ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్
- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ
- వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, జూన్25: అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని.. వచ్చే నెల జూలై నుంచి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వీసీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా వాకటి కరుణ మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్‌లెట్ రూపొందించామని, జూలై మొదటి వారం నాటికి అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్‌పెయింటింగ్స్ వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ పర్యవేక్షించాలని, కేంద్రాల్లో పిల్లలకు ఏక రూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారుల్లో పోషక లోపాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరేండ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పౌష్టికాహారం అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దివ్యాంగ పిల్లలకు సర్టిఫికెట్ త్వరితగతిన అందించేందుకు సదరమ్ క్యాంపులలో అవసరమైన మేర స్లాట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వృద్ధుల సంక్షేమం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14567 ఏర్పాటు చేశామన్నారు. వేములవాడ, సిరిసిల్ల రెవెన్యూ డివిజినల్ అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలో రెండు ట్రిబ్యునల్స్ నడుస్తున్నాయని, ఏవైనా ఇబ్బందులుంటే అప్పీల్ కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కోర్టును సంప్రదించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మండలాధ్యక్షుడు సురేందర్‌రావు
- ₹2లక్షల ప్రమాదబీమా చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి ₹2లక్షల బీమా చెక్కు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్, జూన్ 25: ప్రతి కార్యకర్తా కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. గన్నెవానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నిమ్మలవానిపల్లెకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నిమ్మల ప్రభాకర్ రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈ క్రమంలో పార్టీ నుంచి మంజూరైన ₹2లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందించి, మాట్లాడారు. అనుకోని సందర్భంలో కార్యకర్త మృతి చెందితే.. ఆ కుటుంబం వీధిన పడకూడనే ఉద్దేశంతో పార్టీ అధినేత కేసీఆర్ ముందుచూపుతో బీమా సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలో 30 మందికి బీమా చెక్కులు అందించినట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు తన్నీరు గౌతమ్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, బత్తుల అంజయ్య, చీటి వెంకట నర్సింగరావు, గాడిచర్ల దేవయ్య, గుంటూకు శ్రీకాంత్, నిమ్మల విష్ణు, గన్నె నర్సింహులు, రేపాక బాల్‌నర్స్, గన్నె సుమన్, దేవేందర్, నిమ్మల సతీశ్ ఉన్నారు.

ప్రమాదాలపై గ్రామస్తుల సీరియస్

- రోడ్డుపై చిరుదుకాణాల తొలగింపు

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: ఇటీవల గొల్లపల్లికి చెందిన ఊరడి మహేశ్‌ను కంటైనర్ ఢీకొట్టగా, మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ క్రమంలో గొల్లపల్లి-కామారెడ్డి ప్రధాన రహదారి డివైడర్‌కు ఇరువైపులా, రాజన్నపేట-గొల్లపల్లి రోడ్డులో గాంధీ విగ్రహ కూడలి వద్ద చిరు వ్యాపారాలు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న విషయాన్ని గ్రామస్తులు సీరియస్‌గా పరిగణించారు. మంగళవారం ప్రధాన కూడలితోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరుదుకాణాలను తొలగించారు. రోడ్డుపై ఉన్న ప్లెక్సీలు, బోర్డులు, తీయివేయించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా షాపులు పెడితే ₹5వేల జరిమానా ఉంటుందని వారు తీర్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎడ్ల మహేశ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్25: పట్టణానికి చెందిన ఎడ్ల మహేశ్ (63) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఆయన భౌతికకాయం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు చంద్రశేఖర్, శివను పరామర్శించి.. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నాయకులు చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, కూరగాయల కొమురయ్య, అంబటి చందు, తదితరులు ఉన్నారు.

తైబజార్‌కు ₹14.10లక్షలు

వేములవాడ, జూన్ 25: మున్సిపల్ పరిధిలో తైబజార్ హక్కులను ₹14.10 లక్షలకు కర్ల శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నారని కమిషనర్ అన్వేశ్ తెలిపారు. తై బజార్ వేలంపాటకు నేరెళ్ల సందీప్, కర్ల శ్రీనివాస్, దూలం జనార్ధన్, ధూమ్ రఘు హాజరయ్యారని వెల్లడించారు. కర్ల శ్రీనివాస్ అత్యధికంగా ₹14.10 లక్షల వేలం పాడి కాంట్రాక్ట్ దక్కించుకున్నాడరని కమిషనర్ తెలిపారు. దుకాణాలకు సంబంధించి ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి వేలం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. వేలం పాటలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మేనేజర్ సంపత్‌రెడ్డి ఉన్నారు.

వేటగాడి బైండోవర్

చందుర్తి, జూన్ 25: బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల రాజయ్య పలు గ్రామాల్లో వన్యప్రాణులను వేటాడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాజయ్యను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులకు హానీ కలిగించినా.. వేటాడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

'రాజన్న' ఉద్యోగుల్లో అంతర్మథనం!

- సుదీర్ఘకాలంగా సమస్యలు
- పరిష్కారంపై కానరాని ఐక్యత
- నేడు ఉద్యోగుల కార్యవర్గ సమావేశం

వేములవాడ, జూన్ 25: రాజన్న ఆలయ ఉద్యోగుల్లో అంతర్మథనం మొదలైంది. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలు, పదోన్నతుల వ్యవహారం, పక్క ఉద్యోగిపై ఆరోపణలు వస్తున్నా కార్యవర్గంలో కానరాని ఐక్యతపై మొదలైన చర్చ సంఘం కార్యవర్గ సమావేశానికి తెర లేపింది. వేములవాడ రాజన్న ఆలయంలో 221 పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా, వీరి సంఘం టీఎన్‌జీవో అనుబంధంగా కొనసాగుతున్నది. 2023 జనవరిలో కొత్త కార్యవర్గం ఎన్నిక కాగా, దాదాపు 17 నెలలు కూడా పూర్తయింది. అయితే, ఆలయ ఉద్యోగులపై అనేక ఆరోపణలతో మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇటు ఆలయ పరిపాలనపైనా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని ఐకమత్యంగా ఎదుర్కొనేందుకు ఉద్యోగులు సిద్ధమవుతుండగా, కార్యవర్గం కూడా పటిష్టంగా ఉండి తమకు అండగా నిలవాలని మరికొందరు ఉద్యోగులు సమావేశంలో చర్చించేందుకు సిద్ధమవుతున్నారు.

పదోన్నతులు.. కదలని కుర్చీలు

రాజన్న ఆలయ పరిపాలనలో ఉద్యోగుల ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లపైనా కొందరు ఉద్యోగులు కినుక వహిస్తున్నారు. ఇక రాజన్న ఆలయంలో నలుగురు ఏఈవోలు ఉండగా, 13 మంది పర్యవేక్షకులు, 17 మంది సీనియర్ అసిస్టెంట్లు, 25 మంది జూనియర్ అసిస్టెంట్లు, 30మంది రికార్డ్ అసిస్టెంట్లు, నలుగురు అటెండర్లు, ఇంజినీరింగ్ విభాగంలో ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఏఈలు ముగ్గురు, ఒక ప్లంబర్, పంప్ ఆపరేటర్, తదితరులు ఉన్నారు. అయితే, ఏళ్ల తరబడిగా కొందరు కొన్ని శాఖలకే పరిమితంకాగా, మరికొందరు బదిలీల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. మరోవైపు పదోన్నతులకు అవకాశం ఉన్నవారికి దక్కకుండా ఏదో ఒక దానిలో ఇరికించి పక్కన పెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్న మరికొందరి తీరుపై కొందరు ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. ఈ విషయంపైనా పలువురు ఉద్యోగులు చర్చించే అవకాశమున్నది.

నేడు సమావేశం

రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం బుధవారం వేములవాడ ఉప్పుగడ్డ వీధిలోని ఆలయ టీఎన్‌జీవో భవనంలో సమావేశం కానున్నది. ఆలయ ఉద్యోగులపై వస్తున్న ఆరోపణలు, సంఘం ఐక్యత, కార్యవర్గం పనితీరుపై ఇందులో చర్చించే అవకాశం ఉన్నది. సాయంత్రం నాలుగు గంటలకు ఈ సమావేశం జరగనున్నది.

అక్రిడేటెడ్ జర్నలిస్టుల బస్‌పాస్ గడువు పొడిగింపు

కలెక్టరేట్, జూన్ 25: అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్‌పాస్‌ల గడువును తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) పొడిగించింది. ప్రస్తుత బస్‌పాస్‌ల గడువు ఈ నెల 30తో ముగుస్తోంది. తాజాగా సెప్టెంబర్ 30వరకు మూడు నెలలపాటు జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల కాలపరిమితిని పొడిగిస్తూ తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు బస్‌పాస్‌ల గడువును మూడు నెలలపాటు టీజీఎస్ ఆర్టీసీ పొడిగించింది. అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్ పాస్‌ల దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. కాలపరిమితి పొడిగించిన ఈ బస్‌పాస్‌లను గతంలో మాదిరిగానే వెబ్‌సైట్‌లో (https://tgsrtc pass.com/journalist.do?category=Fresh) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల్లో జర్నలిస్టుల వ్యక్తిగత వివరాలను నమోదు చేయడంతోపాటు ఫొటో, అక్రిడిటేషన్ కార్డులను విధిగా అప్‌లోడ్ చేయాలి. బస్‌పాస్ కలెక్షన్ సెంటర్‌ను ఎంపిక చేసుకోవాలి. దరఖాస్తులను సమాచార, పౌరసంబంధాల శాఖ ఆన్‌లైన్‌లో ధ్రువీకరించిన తర్వాత జర్నలిస్టులకు బస్‌పాస్‌లను టీజీఎస్ ఆర్టీసీ జారీ చేస్తుంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

NAME CHANGE

★I SHAHEEN R/o H.No 1-2-149 Sha Sahab Street Karimnagar TS. Changed My Name As SYEDA SHAHEEN W/o SYED ALEEMULLAH QUADRI

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

భారీ ర్యాలీని విజయవంతం చేద్దాం

తెలంగాణ చౌక్, జూన్ 25: మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో జరిగే డ్రగ్స్ అవగాహన సదస్సులో జిల్లాలోని విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బంద్‌ను సక్సెస్ చేయాలి

కోనరావుపేట, జూన్25: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజ్యం కార్తీక్ పిలుపునిచ్చారు. పాఠశాలలు ప్రారంభమైనా విద్యార్థులకు ప్రభుత్వం వసతులను కల్పించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నా.. ప్రభుత్వం చూసీచూడనట్లు వదిలేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చామని, ఇందుకు పాఠశాల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

నేతకార్మికులు మనోధైర్యం కోల్పోవద్దు

సిరిసిల్ల రూరల్, జూన్ 25: నేతకార్మికులు మనోధైర్యం కోల్పోవద్దని పద్మశాలీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ కోరారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు నరేశ్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి, ₹5వేల ఆర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య ₹2వేలు అందజేశారు. నేత కార్మికుల ఆత్మహత్యల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసానిచ్చారు. ఇక్కడ గడ్డం మధుకర్, గుంటుక మహేశ్, మామిడాల శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

మౌనం వీడండి.. ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- గత ఆరు నెలల్లో నమోదైన కేసుల వివరాలు వెల్లడి

మహిళలకు అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం సభ్యులు (ఫైల్)

తెలంగాణ చౌక్, జూన్ 25: ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే మహిళలు, యువతులు మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గత ఆరు నెలలుగా జిల్లా వ్యాప్తంగా షీ టీం ఆధ్వర్యంలో నమోదైన కేసుల వివరాలను మంగళవారం ఆయన ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. గడిచిన ఆరు నెలలో జిల్లాలో మహిళలను వేధిస్తున్న వారిపై 24 కేసులు, ఈవ్‌టీజింగ్ చేస్తున్న వారిపై 18కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. షీ టీం బృందాలు పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్ ప్రాంతాల్లో, మహిళలు పని చేస్తున్న ప్రదేశాలల్లో యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌పై అవగహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రతపై జిల్లా పోలీస్‌శాఖ అధిక ప్రాధ్యాన్యత ఇస్తున్నదని వివరించారు. ఎలాంటి సమస్యలు వచ్చిన నేరుగా 87126-56425 నంబర్‌కి గానీ, డయల్ 100కి గానీ కాల్ చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్

నాణ్యమైన విద్యనందిస్తున్నాం

గంభీరావుపేట, జూన్ 25: సకల వసతులు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను మంగళవారం ఆయన కళాశాలలో విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ కీలకమని, లక్ష్యం దిశగా విద్యను అభ్యసించాలని సూచించారు. ఇక్కడ అధ్యాపకులు శ్రీధర్, గజానంద్, శ్రీనివాస్, పాపారావు, నాంపల్లి, కవిత, సంతోష ఉన్నారు.

జిల్లా రైతు వేదికలో 'రైతు నేస్తం'

- 'రైతు భరోసా'పై అభిప్రాయాలు తెలుసుకున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన రైతులు

సిరిసిల్ల రూరల్, జూన్ 25: చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో డీఏవో భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల డివిజన్ స్థాయి రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులతో మాట్లాడారు. రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఐదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని కొందరు, పదెకరాల వరకు ఇవ్వాలని మరికొందరూ.. సాగు చేసిన రైతులకే ఇవ్వాలని మరికొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచలను పాటించి లాభసాటి సాగు చేయాలని డీఏవో భాస్కర్ సూచించారు. ఇక్కడ ఏవోలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ముస్తాబాద్ మేజర్ జీపీ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న మోతె రమేశ్

ముస్తాబాద్ మేజర్ జీపీ ఈవోగా మోతె రమేశ్

'నమస్తే' కథనానికి స్పందన

ముస్తాబాద్, జూన్ 26: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీకి పూర్తి స్థాయిలో గ్రేడ్-1 అధికారి మోతె రమేశ్‌ను నియమించారు. 'వద్దు బాబోయ్.. ఈవో పదవి'.. అంటూ ఈ నెల 24న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో గంభీరావుపేట పంచాయతీ ఈవోగా పని చేసి సెలవుపై వెళ్లిన రమేశ్‌ను ముస్తాబాద్ జీపీకి పూర్తిస్థాయిలో ఈవోగా నియమించడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయండి

తెలంగాణ చౌక్, జూన్ 25: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించాలని కోరారు. ఇప్పటివరకు భోజనం అందించకపోవడం బాధాకరమని, మరింత జాప్యం చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ జిల్లా నేతలు మట్టి శ్రీనివాస్, అరవింద్, వెంకటేష్, నవీన్, నరేశ్, తిరుపతి ఉన్నారు.

కుల వివక్షకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

వన్‌పల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

వీర్నపల్లి, జూన్25: కుల వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. బంజేరు, మద్దిమల్ల, వన్‌పల్లిలో పొరహక్కులు, కుల బహిష్కరణ, ఎస్సీ, ఎస్టీ కేసులు, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పెండింగ్ కోర్టు కేసులు, కుల సంఘాల సభ్యులు, పెద్ద మనుషులు పంచాయితీలు పెట్టవద్దన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించవద్దని సూచించారు. యువత సైబర్ నేరాల బారిన పడవద్దని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని పేర్కొన్నారు. ఫోన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇక్కడ ఎస్ఐ రమేశ్‌కుమార్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 25: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ మంగళవారం లాలాబాహుట్ చేనేత పవర్‌లూమ్ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబ శివరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. 30వేల కుటుంబాలకు ఉపాధి కరువైందని, ఇప్పటివరకు 11 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నేతన్నల ఆత్మహత్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బతుకమ్మ చీరల బకాయిలను మంజూరు చేయాలని కోరారు. ఇక్కడ గుంటి వేణు, తదితరులు ఉన్నారు.

చెరువు కట్ట పరిశీలన

వేములవాడరూరల్, జూన్25: వట్టెంల శివారులోని రొంపి చెరువును ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి పరిశీలించారు. చెరువు కట్ట కొంత కుంగిపోవడంతో ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ తీసుకెళ్లారు. దీంతో విప్ అదేశాలతో ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్ రొంపి చెరువును పరిశీలించారు. చెరువు మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు స